
సాక్షి ఒడిశా

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.35.028లు, బంగారం 490 మిల్లీగ్రాములు వెండి 17 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చెట్టుకొమ్మలు పడి బైక్ రైడర్ మృతి

బొలంగీర్ జిల్లా కంటాబంజి రాణా కుల్లీ గ్రామం ధోపో ఘాటెన్ మందిరం దగ్గర చెట్టు కొమ్మలు విరిగిపడి ఒకరు మృత్యువాత పడ్డారు.

- 8లో.



భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయగడ బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు.

- 8లో.

న్యూస్‌రీల్

శిక్షణ కార్యక్రమానికి కాంగ్రెస్ దూరం

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో ఈనెల 17 నుంచి జరగనున్న తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల శిక్షణా కార్యక్రమానికి కాంగ్రెస్ దూరంగా ఉంటుందని ఆ పార్టీ శాసన సభ నాయకుడు రామచంద్ర కదమ్ గురువారం స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బహిష్కరించాలని రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీజేడీ, కాంగ్రెస్ నిర్ణయించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర మంత్రులను ఆహ్వానించడం ద్వారా అధికార బీజేపీ ఈ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి లేదా స్పీకర్ కార్యక్రమం నిర్వహిస్తే తాము హాజరయ్యేవాళ్లమని పేర్కొన్నారు. దీనివలన ఎమ్మెల్యేలు ప్రయోజనం పొందే అవకాశం లేదన్నారు.

చేపల వేట నివారణ

భువనేశ్వర్: రానున్న 24 గంటల్లో పశ్చిమ బెంగాల్ గంగా నదిపై అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈనెల 17 వరకు సముద్రంలోకి వెళ్లవద్దని ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం గురువారం మత్స్యకారులకు సూచించింది. ఈ మేరకు గంజాం, పూరీ, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, భద్రక్, బాలాసోర్ జిల్లా కలెక్టర్లకు, మత్స్య - పశు వనరుల అభివృద్ధి శాఖకు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం లేఖ పంపింది. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు తిరిగి తీరానికి తక్షణమే చేరాలని సందేశం ప్రసారం చేసింది. భద్రక్, బాలాసోర్ జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, కటక్, ఖుర్దా, నయాగడ్, పూరీ, మయూర్‌భంజ్, కెంజొహర్, సుందర్‌గడ్, అంగుల్, ఢెంకనాల్, నవరంగ్‌పూర్, కొరాపుట్ మరియు మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం ఐఎండీ ముందస్తు సమాచారం జారీ చేసింది.

నబరంగ్‌పూర్ పర్యటనకు మంత్రి సూరజ్ సూర్యవంశీ



మంత్రి సూరజ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు

కొరాపుట్: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూరజ్ సూర్యవంశీ నబరంగ్‌పూర్ జిల్లాకు విచ్చేశారు. గురువారం సాయంత్రం మల్కన్‌గిరి జిల్లా నుంచి రోడ్డు మార్గాన జిల్లాకు వచ్చారు. కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లాలను విడదీసే ఇంద్రావతి నది ఒడ్డున జిల్లా అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. అప్పటికే చేరుకున్న నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జిలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పలువురు ప్రజలు మంత్రికి వినతులు సమర్పించారు. అనంతరం సర్క్యూట్ హౌస్‌కి చేరుకున్నారు. అక్కడ బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ యువ నాయకుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కనుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీసీ బ్యాంక్‌కి ఎన్ఐఆర్‌బీ ప్రశంసాపత్రం



ప్రశంసా పత్రం అందుకుంటున్న కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌కి ఎన్ఐఆర్‌బీ ప్రశంసా పత్రం లభించింది. గురువారం బెంగుళూరు లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ద్వారా నిర్వహించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ బ్యాంకిగ్ (ఎన్ఐఆర్‌బీ) కేంద్రంలో శిక్షణా శిబిరం ముగిసింది. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతీ రాష్ట్రం నుంచి ఒక్కో కో-ఆపరేటివ్ బ్యాంక్‌కి శిక్షణ ఇచ్చారు. రాష్ట్రం నుంచి కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మాత్రమే అవకాశం వచ్చింది. ఈ శిబిరంలో బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహికి ఎన్ఐఆర్‌బీ డైరెక్టర్ అరుణ్ కుమార్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ శిబిరానికి కేసీసీ డైరెక్టర్లు భీమొ హరిజన్ (నబరంగ్‌పూర్), రమాకాంత్ రౌలో (జయపూర్)లు హాజరయ్యారు.

జెండా.. మది నిండా..!

రాష్ట్రవ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విను వీధుల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడగా.. జన గళమున జనగణమన ప్రతిధ్వనించింది. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎందరో అమర వీరుల త్యాగ ఫలమే దేశానికి స్వాతంత్ర్యమని, వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



అత్యున్నత స్థాయికి ఒడిశా ఆత్మ గౌరవం

- సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రానున్న రోజుల్లో ఒడిశా ఆత్మ గౌరవం అత్యున్నత స్థాయికి చేరుకుంటుందని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానిక మహాత్మా గాంధీ మార్గ్‌లో వివిధ వర్గాలకు చెందిన కంటింజెంట్ల కవాతు స్వీకరించారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఒడిశా ప్రజలకు సేవ చేయడానికి తాము కట్టుబడి ఉన్నట్లు తెలియజేశారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం పూరీ శ్రీమందిరం నాలుగు ద్వారాలను తెరవడం పూర్తయ్యిందన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి సుభద్ర పథకం ప్రారంభమవుతుందని వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.5 లక్షల పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. 2047 నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, దేశ శ్రేయస్సు కోసం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. త్వరలో 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాష్ట్ర పరేడ్‌లో 59 మంది కంటింజెంట్లు పాల్గొన్నారు. ఒడిశా పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్, 120వ బెటాలియన్, సీఐఎస్ఎఫ్, ట్రాఫిక్, బీఎస్ఎఫ్, అగ్నిమాపక దళం, పాఠశాల, కళాశాల విద్యార్థులు కవాతులో పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్ సాయుధ పోలీస్ మరియు ఇండో-టిబెటన్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన బృందం కూడా తొలిసారిగా కవాతులో పాల్గొంది.



భువనేశ్వర్: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి



కొరాపుట్: పద్మశ్రీ గోవర్ధన్ పనికాని సత్కరిస్తున్న మంత్రి నిత్యానంద



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో జెండా ఎగురవేస్తున్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో



రాయగడ: అభివాదం చేస్తున్న మంత్రి స్వయి



చిన్నారులతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న విపక్ష నేత నవీన్ పట్నాయక్



రాయగడ: గాంధీజీ సత్యాగ్రహం రూపకం



పర్లాకిమిడి: మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నట్లు రూపకం



భువనేశ్వర్: కటక్ జిల్లా ధవలేశ్వరంలో త్రివర్ణ శోభిత ధవలేశ్వరుడు



రాయగడ: విద్యార్థుల ప్రదర్శనలు



మల్కన్‌గిరి: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సూర్యవంశీ సురాజ్



మల్కన్‌గిరి: విద్యార్థుల ప్రత్యేక విన్యాసాలు



పర్లాకిమిడి: విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



కొరాపుట్: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి నిత్యానంద గొండో



కొరాపుట్: గంజాం జిల్లాలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



పర్లాకిమిడి: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి బిభూతి భూషణ్ జెన్నా



భువనేశ్వర్: గౌరవ వందనం స్వీకరిస్తున్న తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్



జయపురం: పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు



మల్కన్‌గిరి: విద్యార్థినుల ప్రత్యేక పరేడ్

పోలీసు పతకాలు ప్రదానం



ఎస్‌ఓజీ కమాండో అరుణ్ కుమార్‌కు పతకం ప్రదానం చేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి



సీఎం చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మహిళా పోలీసు అధికారి

భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు రంగంలో ఉత్తమ సేవలు అందజేసిన వారికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పతకాలు ప్రదానం చేశారు. స్థానిక లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు పతకాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్, అగ్నిమాపకం, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, జైలు సంస్కరణల సేవా రంగాల్లో ఉన్నత సేవలు అందజేసిన అధికారులు, సిబ్బందికి పతకాలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

రాయగడ:

జిల్లాలో కాసీపూర్ సమితి టికిరిలోని జొడియా, గొతివీధుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. టికిరి - రాయగడ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలు పట్టుకుని రస్తారోకో నిర్వహించారు. ఈ రెండు వీధుల్లో సుమారు 50 కుటుంబాలకు చెందిన దాదాపు 500 మంది నివసిస్తున్నారు. వీరందరి కోసం ఉన్న రెండు గొట్టపు బావుల్లో ఒకటి రెండు నెలల క్రితం మరమ్మతులకు గురవ్వగా, ఉన్న మరొక గొట్టపు బావి కూడా గత వారం రోజులుగా పనిచేయడం లేదు. సమస్యను పరిష్కరించాలని టికిరి పంచాయతీ సర్పంచ్ జగబంధు మాఝికి ఆ ప్రాంత వాసులు విన్నవించుకోగా, రెండు రోజుల పాటు ట్యాంకర్ల సాయంతో నీటిని సరఫరా చేశారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని గుర్తించిన మహిళలు బుధవారం ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల పాటుగా రహదారిపై బైఠాయించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సమాచారం తెలుసుకున్న ఏబీడీవో పద్మిని కుహరో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. వారం రోజుల్లో రెండు వీధులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



బిందెలతో రహదారి వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



వ్రత పూజలు నిర్వహిస్తున్న రాంజీ ఆచార్యులు

రాయగడ: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సత్యనారాయణ వ్రత పూజలు గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృత పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మలు పడి బైక్ రైడర్ మృతి



ఘటనా స్థలం వద్ద దృశ్యం

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా కంటాబంజి థాణా కుర్లీ గ్రామం ధోపో ఘాటెన్ మందిరం దగ్గర విషాద ఘటన చోటు చేసుకుంది. కంటాబంజి నుంచి వస్తుండగా సిహని గ్రామస్తుడు గోపాల్ రాణాపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆటోలో స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఉన్నత చికిత్స కోసం బొలంగీర్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచాడు.

కొత్త అతిథులు



పార్కుకు తీసుకొచ్చిన కొత్త జంతువులు

భువనేశ్వర్: బారంగ్ నందన్‌కానన్ బయోలాజికల్ పార్క్‌కు కొత్త అతిథులు విచ్చేశారు. జంతు మార్పిడి విధానంలో వీటిని ఇక్కడికి తీసుకొచ్చారు. ఇవి మధ్య మరియు దక్షిణ అమెరికా ప్రాంతీయ కోతి జాతి జంతువులుగా పేర్కొన్నారు. వీటిని ప్రస్తుతం నిర్బంధంలో ఉంచారు. సందర్శకుల రాకపోకలు, వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేంత వరకు ప్రత్యేక సంరక్షణలో ఉంచడం జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

నిలిచిన సీటీ స్కాన్ సేవలు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో గత రెండు రోజులుగా సీటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ జిల్లా ఆస్పత్రిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ సీటీ స్కాన్ అందుబాటులో లేకపోతే శ్రీకాకుళం వరకు వెళ్లాల్సి వస్తుంది. మరో రెండు రోజుల్లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వస్తాయని అక్కడ సిబ్బంది తెలిపారు.

జెమ్స్‌లో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో పుట్టుకతో మూగ, చెవుడు సమస్య ఉన్న చిన్నారులకు ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ కె.సుధీర్ గురువారం తెలిపారు. జలుమూరు మండలం, యర్రన్నపేట గ్రామానికి చెందిన పైడి అచ్చెన్న సుజాత దంపతుల కుమార్తె రోహిణి పుట్టుకతో ఈ సమస్యతో బాధ పడుతోంది. ఈ చిన్నారికి రూ.15లక్షల ఖర్చుతో ఉచితంగా శస్త్రచికిత్సను నిర్వహించారు. 15 రోజుల పర్యవేక్షణ తర్వాత పాప అందరిలాగే స్పందించిందని తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, సర్జరీ నిర్వాహకులు కృష్ణ కిశోర్, డాక్టర్ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

పొందూరు: కెనరా బ్యాంక్ సీఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా కెనరా విద్యా జ్యోతి పథకంలో ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ బాలికలకు కింతలి కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం.రవి గురువారం నగదు అందజేశారు. 5, 6, 7వ తరగతి చదువుతున్న బాలికలకు రూ.3వేల చొప్పున, 8, 9, 10వ తరగతి బాలికలకు రూ.5 వేల చొప్పున అందించారు. కెనరా బ్యాంక్ సిబ్బంది పి.రామ్‌కిశోర్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతగా కలెక్టరేట్ జట్టు



ట్రోఫీ అందుకుంటున్న కలెక్టరేట్ లెవెన్ జట్టు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో ప్రెస్‌క్లబ్ వర్సెస్ కలెక్టరేట్ లెవన్ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ గురువారం జరిగింది. తొలుత టాస్ గెలిచిన కలెక్టరేట్ లెవన్ టీమ్ బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 15 ఓవర్లలో ఆలౌట్ అయ్యి 111 రన్స్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ లెవన్ జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 15 ఓవర్లకు 85 పరుగులు మాత్రమే చేసింది. దీంతో కలెక్టరేట్ లెవన్ జట్టు విన్నర్స్‌గా నిర్వాహకులు ప్రకటించారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా కలెక్టరేట్ లెవన్ జట్టుకు చెందిన అనూప్ పండా నిలిచారు. కలెక్టరేట్ లెవన్ సిబ్బందికి ఏడీఎం రాజేంద్ర మింజ్ ట్రోఫీ అందజేశారు.

రాజ్ భవన్‌లో వేడుకలు



చిన్నారులతో గవర్నర్ రఘుబర్ దాస్

భువనేశ్వర్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో గవర్నర్ రఘుబర దాస్ జాతీయ పతాకం ఆవిష్కరించారు. స్థానిక అంధుల పాఠశాల పిల్లలు, క్యాన్సర్ పీడిత చిన్నారులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులు కావడం విశేషం.

నివేదిక అందజేత



రథంపై బోర్లాపడిన బలభద్ర స్వామి మూల విరాట్

భువనేశ్వర్: ఈ ఏడాది జరిగిన పూరీ శ్రీజగన్నాథుని రథయాత్రలో మూల విరాటులను రథం పైనుంచి దించి గుండిచా మందిరం అడపా మండపానికి తరలించే క్రమంలో బలభద్ర స్వామి మూల విరాటు పట్టు కోల్పోయి బోర్లా పడింది. వాస్తవానికి పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన భక్తజన హృదయాలను కలిచివేసింది. దీంతో పలు వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో విచారణ కోసం త్రిసభ్య కమిటీ విచారణకు ఆదేశించారు. విచారణ కమిటీ నివేదిక బుధవారం సాయంత్రం అందిందని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. త్వరలో జరగనున్న శ్రీజగన్నాథ ఆలయ పాలక మండలి సమావేశంలో దీనిపై చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నారు.

నిమ్మాడలో దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

కోటబొమ్మాళి: 'సాక్షి' పత్రికలో గురువారం ప్రచురితమైన 'డెంగీ మృతిపై తూతూమంత్రంగా విచారణ' కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. తక్షణమే నిమ్మాడ కాలనీలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిమ్మాడ పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌కుమార్, సిబ్బంది బుధవారం నిమ్మాడ కాలనీలో ఫాగింగ్ చేశారు. అనంతరం నీలమ్మ కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి ఆరోగ్య సర్వే చేపట్టి నివేదిక పంపాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు పీహెచ్‌సీ వైద్యుడు సురేస్‌కుమార్ తెలిపారు.

బస్సు ఢీకొని సీఐఎస్‌ఎఫ్ జవాను మృతి





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఐఎస్‌ఎఫ్ జవాన్ రాము ఇన్‌సెట్‌లో పేడాడ రాము(ఫైల్)

ఆమదాలవలస: దివంజిపేట జంక్షన్ సమీపంలోని అలికాం బత్తిలి రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేడాడ రాము (35) అనే సీఐఎస్‌ఎఫ్ జవాను మృతి చెందాడు. ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు మండలం కలిగాం గ్రామానికి చెందిన రాము సీఐఎస్‌ఎఫ్ జవానుగా విశాఖపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. అతను గురువారం ఆమదాలవలస నుంచి హిరమండలం వైపు తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. హిరమండలం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వంశధార కుడి ప్రధాన కాలువపై ఉన్న వంతెన మలుపు వద్ద రాము బండికి ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. రాము హెల్మెట్ ధరించి ఉన్నా తలకు దెబ్బ తగిలి తీవ్రంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులతోపాటు, ఆ గ్రామానికి చెందిన పలువురు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని బస్సు డ్రైవర్‌పై చర్యలు చేపట్టాలని ఆందోళనకు దిగారు.

కలిగాంలో విషాద ఛాయలు

కొత్తూరు: కలిగాం గ్రామానికి చెందిన పేడాడ రాము రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యువకుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సీఐఎస్‌ఎఫ్ జవానుగా పనిచేస్తున్నాడు. వరలక్ష్మీ వ్రతం కోసం ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుమారుడి మరణవార్త విని తల్లిదండ్రులు వెంకన్న అమ్మాయమ్మ కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రాజీవ్‌గాంధీ బస్ స్టేషన్ వద్ద ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మూడు రంగుల జెండా బ్యాండ్ చేత పట్టుకుని నిర్మాణంలో ఉన్న బస్టాండ్‌పైకి వెళ్లగా అక్కడ విద్యుత్‌షాక్ తగిలి కిందకు పడిపోయాడు. దీన్ని చూసిన చుట్టుపక్కల వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ యువకుడు రెండు రోజులుగా ఇక్కడే ఉంటున్నాడని, కాస్త మతిస్థిమితం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాశీబుగ్గ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అమానుషం..

ఉదయం ఎనిమిది గంటలకు ఈ సంఘటన జరగ్గా.. పదకొండు గంటలకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అంబులెన్స్‌లోకి మృతదేహాన్ని ఎక్కించేందుకు ఇద్దరు వ్యక్తులకు పని అప్పగించారు. మద్యం మత్తులో ఉన్న ఆ ఇద్దరూ మృతదేహాన్ని ఎత్తే క్రమంలో రెండుసార్లు కింద పడేశారు. చూసిన వారంతా అయ్యో పాపం అనుకున్నారు. బియ్యం మూట ఎత్తినట్టుగా కనీస మర్యాద పాటించకుండా మృతదేహాన్ని ఎక్కించిన తీరు చూసి స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

త్వరలో బౌధ్ ప్రాంతానికి రైలు

భువనేశ్వర్: రాష్ట్రంలో క్రమంగా రైలు మార్గాల విస్తరణ పుంజుకుంటోంది. పలు మారుమూల ప్రాంతాలకు రైలు రవాణా సౌకర్యం అంచెలంచెలుగా అందుబాటులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఝొరొముండా నుంచి బౌధ్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు రవాణాకు పట్టాల పటిష్టత, ఇతరేతర సాంకేతిక వ్యవస్థపై రైల్వే భద్రతా కమిషనర్ సీఆర్‌ఎస్ పర్యవేక్షణ విజయవంతంగా ముగిసింది. దీంతో బౌధ్ త్వరలో రైల్వే మ్యాప్‌లో చోటు చేసుకుంటుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

పారాదీప్ స్టేషన్‌లో బంగ్లాదేశ్ పౌరులు

భువనేశ్వర్: బంగ్లాదేశ్ పౌరులుగా అనుమానిస్తున్న 12 మందిని పారాదీప్‌లో పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. కోల్‌కతాలోని బాబుఘాట్ నుంచి వీరు బస్సులో పారాదీప్ చేరుకున్నారు. వీరి కదలికపై సందేహం కలిగిన స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదర్శ పోలీసు ఠాణా వర్గాలు వీరికి సంబంధించిన గుర్తింపు వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

విద్యార్థులకు అస్వస్థత

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లా ఆనంద్‌పూర్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న 5 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆనంద్‌పూర్‌లోని బ్రిడ్జ్ చౌక్ గ్రౌండ్‌లో సబ్ డివిజనల్ స్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో వీరు పాల్గొన్నారు. వీరిని ఆస్పత్రికి తరలించారు.

మోసగించిన వ్యక్తి అరెస్టు

జయపురం: మంత్రాల ద్వారా వ్యాధి బాగు చేస్తానని ప్రజలను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం తెలిపారు. ఈనెల 13వ తేదీన జయపురం సమితి అంబాగుడ పంచాయతీ పుటర గ్రామానికి చెందిన దుర్యోధన గౌడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను అరెస్టు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక బాలిక గోళ్లు, తల వెంట్రుకలు ఇస్తే మంత్రాలతో ఆరోగ్యం నయమవుతుందని, ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని తెలిపి రూ.1500 తీసుకున్నాడన్నారు. అయితే వ్యాధి నయం కాలేదని, అలాగే అందరినీ మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి బలంగీర్ జిల్లా టిటలాఘర్ పీఎస్ పరిధి కుముడ గ్రామానికి చెందిన పంచు నబరగా పేర్కొన్నారు. అతడి వద్ద నుంచి రూ.8,000 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిందితుడి అరెస్టు

జయపురం: ఒక గంజాయి కేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు సదరు పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం తెలియజేశారు. నిందితుడుని బొయిపరిగుడ సమితి పలిగుడ గ్రామానికి చెందిన మహేంద్ర ఖిలోగా పేర్కొన్నారు. అతడిని కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని చిన్ననారాయణ పురం గ్రామ సమీప రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగి, అతని కుమార్తెతో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మే రకు.. సంతబొమ్మాళి మండలం చెలగపేట గ్రామానికి చెందిన ఎ.చంద్రమౌళి అతని కుమార్తె లిఖితను తీసుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా చిన్ననారాయణపురం గ్రామ సమీపంలో గల్లినొపడకు చెందిన వాకాడ జగన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రెండు వాహనాలపై ఉన్న ముగ్గురికీ గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. జగన్ పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయ్యనున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆస్పత్రికి చేరుకున్నారు.

సిపాయి నుంచి సుబేదార్ మేజర్ స్థాయికి ఎదిగి..



గౌహతి క్యాంప్‌లో కమాండెంట్ కల్నల్ అరవింద్ వన్నూరి చేతులమీదుగా అవార్డు మెడల్ స్వీకరిస్తున్న సుబేదార్ మేజర్ శ్యామ్‌గుణ

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన కప్పల శ్యామ్‌గుణ దేశసేవలో సిపాయిగా చేరి, అంచెలంచెలుగా ఎదిగి సుబేదార్ మేజర్ స్థాయికి చేరారు. పనితీరుకు గుర్తుగా తన విధి నిర్వహణలో ఎన్నో అవార్డులు తీసుకున్నారు. తాజాగా 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అస్సాం గౌహతిలోని నార్త్ ఈస్ట్ సెక్టార్‌లో 73 మీడియం రెజిమెంట్ క్యాంప్‌లో కమాండెంట్ కల్నల్ అరవింద్ వన్నూరు చేతులమీదుగా 'హానరీ కెప్టెన్'గా గురువారం మెడల్‌ను అందుకున్నారు. కేసరపడ గ్రామానికి చెందిన దివంగత లచ్చయ్య-చంద్రమ్మల మూడో సంతానం శ్యామ్‌గుణ. శ్యామ్ పెద్దక్క కంచిలి మండల జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, తల్లి చంద్రమ్మ కేసరపడ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. ఈయన 1991 నుంచి ఆర్మీలో సేవలందిస్తున్నారు.



మంచంపై గర్భిణిని మోసుకెళ్తున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి పూల్‌భట్ట గ్రామ పంచాయతీ ఝొడొయంబ గ్రామానికి చెందిన గర్భిణి ముని శాంతకు బుధవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆమె కుటుంబ సభ్యులు అంగన్‌వాడీ కార్యకర్తకు విషయం తెలియజేశారు. ఆమె వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసింది. అయితే అంబులెన్స్ గ్రామానికి రావాలంటే మార్గంలో రెండు చోట్ల కొండ వాగులు దాటాలి. అందువలన అంబులెన్స్ మార్గ మధ్యలోని పొడైకుంట గ్రామంలో నిలిచిపోయింది. ఈ విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్ గర్భిణి మహిళ బంధువులకు తెలియజేశారు. దీంతో మరోదారి లేక కుటుంబ సభ్యులు, కొంతమంది గ్రామస్తులు ఒక మంచంపై ఆమెను సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు మోసుకెళ్లి అంబులెన్స్ ఎక్కించారు. అనంతరం అంబులెన్స్‌లో కుంద్ర కమ్యూనిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రెండు వాగులపై కల్వర్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహిళలకు ప్రత్యేకం



జెండాకు సెల్యూట్ చేస్తున్న డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ

భువనేశ్వర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా రాష్ట్రంలోని మహిళలకు గుడ్ న్యూస్ చెప్పారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్‌రంగ ఉద్యోగినులకు ఒక రోజు రుతుక్రమ సెలవును ప్రకటించారు. ఋతుచక్రం యొక్క మొదటి లేదా రెండవ రోజు ఈ సెలవు పొందవచ్చన్నారు. కటక్ జిల్లా స్థాయి స్వాతంత్య్ర దినోత్సవంలో జాతీయ పతాక ఆవిష్కరణ పురస్కరించుకుని ఈ సదుపాయం ప్రకటించారు.

కేంద్రాపడాలో విషాదం

- అగ్ని ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల దుర్మరణం

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా రాజ్‌నగర్ పోలీసు ఠాణా పరిధి బలరామ్‌పూర్ గ్రామంలో గురువారం ఉదయం ఘోర విషాదం చోటు చేసుకుంది. ఇల్లు కాలిన ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సజీవ దహనమన్నారు. వీరివురు అక్కాతమ్ముళ్లు. మృతులు 11 ఏళ్ల బాలిక మరియు ఆమె తమ్ముడు 9 ఏళ్ల బాలుడుగా గుర్తించారు. తల్లిదండ్రులు ఏదో పని నిమిత్తం బయటికి వెళ్లిన సమయంలో తోబుట్టువులు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లో నుంచి పొగలు కమ్ముకోవడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని చిన్నారులను రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మంటలు చెలరేగడంతో ఇద్దరు అక్కాతమ్ముళ్లు సజీవ దహనమయ్యారు. సమాచారం అందడంతో అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి నిర్విరామంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఎల్‌పీజీ సిలిండర్ లీక్ వల్ల ఇంట్లో మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు.

సీఎం మోహన్ చరణ్ సంతాపం

కేంద్రాపడా జిల్లా రాజ్‌నగర్ తహసీల్‌లో ఇద్దరు చిన్నారులు అగ్ని ప్రమాదంలో మరణించారని తెలియడంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొన్న ఆటో

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సును వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీ కొట్టిందని ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ట్రావెల్స్ బస్సు బయలుదేరి కొరసవాడ వైపు వెళ్తుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అజాగ్రత్తగా వస్తున్న ప్రహరాజపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ మహంతి రాజారావు బలంగా ఢీకొట్టాడు. బస్సు వెనుక కుర్చున్న ప్రయాణికులు ఇజ్జాడ గురునాథం, ఆయన భార్య ఇజ్జాడ చెంచమ్మ, ఆటో డ్రైవర్ రాజారావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు, తోటి ప్రయాణికులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు షణ్ముఖరావు ప్రథమ చికిత్స అందించారు. ఇజ్జాడ గురునాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట కల్యాణ మండపంలో వనమాళి శాంతారావు, పంచిరెడ్డి విశ్వనాథం ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వ్రతాలను మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకం..

జలుమూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు మైత్రీ ఫౌండేషన్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు పట్ట త్రినాథరావు, ఆనేం శ్రీనివాసరావు తెలిపారు. చల్లవానిపేటలో ఈ ఏడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు సాయి గిరీష్, కె.లుధియా, దుంగ అమృతలకు రూ.మూడు, రూ.రెండు, రూ.వెయ్యి చొప్పున గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మెండ రామారావు, బోల్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు. కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో కరవంజ మోడల్ స్కూల్‌లో ఐదు నుంచి పది తరగతులు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. 5, 6, 7వ తరగతులకు చెందిన విద్యార్థులకు రూ.3 వేలు, పదో తరగతి విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు.

ఆర్థికసాయం



చల్లవానిపేటలో విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గురువారం తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కడుము గ్రామానికి చెందిన వలరౌతు ఈశ్వరరావుది నిరుపేద కుటుంబం. ఈయనకు రెండు కిడ్నీలు పాడవ్వడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్టు సభ్యులు రూ.20 వేలు అందజేశారు. నివగాం గ్రామానికి చెందిన ఉర్లాన వెంకటరావు, బుజ్జిమ్మలది నిరుపేద కుటుంబం. పూరిగుడిలో నివాసం ఉంటున్నారు. వీరికి రూ.15 వేలు విలువ చేసిన నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భరతమాత అలంకరణలో పైడితల్లి



భరతమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన పైడితల్లి

విజయనగరం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వనంగుడిలోని పైడితల్లి అమ్మవారిని భరతమాతగా అర్చకులు గురువారం అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భోగాపురం: డెంకాడ మండలం బంటపల్లి గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బమ్మిడి రమణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. పోలీసులు భోగాపురంలో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా బంటుపల్లి నుంచి భోగాపురానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

బొబ్బిలి: బొబ్బిలి పోలీసుల అదుపులో గంజాయి ముఠా నిందితులు ఉన్నట్టు తెలిసింది. గతంలో గంజాయిని తరలిస్తూ పట్టుబడక తప్పించుకున్న వారు ఇటీవల కొద్ది రోజుల క్రితం పట్టుబడ్డట్టు భోగట్టా! ఈ విషయమై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. విచారణ చివరి దశకు వచ్చిన నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో కేసు విషయాన్ని పత్రికలకు విడుదల చేసే అవకాశాలున్నాయి. అలాగే బాడంగి మండలం ముగడ కాలనీలో వృద్ధురాలు గెద్ద కృష్ణవేణిని హత్య చేసిన పారాదికి చెందిన పాత నేరస్తురాలు లలిత అనే మహిళను నిందితురాలిగా అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రస్తుతం ఆమెను విచారిస్తున్నారు. కేవలం ఒక్క ఆమే ఈ హత్య చేసిందా లేక మరెవరి సహాయాలున్నాయా అన్న కోణంలో ఆమెను విచారిస్తున్నారు. ఈ విషయంలోనూ పోలీసులు అరెస్టు చూపించి ఆమెను విలేకర్ల ముందు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు వద్ద ప్రస్తావించగా మొత్తం రెండు మూడు నేరాలకు సంబంధించి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని, దర్యాప్తులు కొలిక్కి వస్తున్నట్టు తెలిపారు.

హెచ్‌సీ సేవలకు సత్కారం

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కృష్ణమూర్తిని దుర్గా బైక్ మెకానిక్ సేవా సంఘం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కృష్ణమూర్తి సేవాభావం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. ప్రతి నెలా తన వేతనంలో కొంత మొత్తం పేదల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పేదలకు తన వంతు అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డులో దిగబడిన లారీ

భామిని: మండలంలోని బిల్లుమడ – నులకజోడు గ్రామాల మధ్య ఏబీ రోడ్డుపై గురువారం ఉదయం ఓ లారీ గోతిలో దిగబడింది. ఒడిశా నుంచి ఇసుకతో వస్తున్న లారీ గోతిలో కూరుకుపోవడంతో రెండువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థులకు దుస్తులపంపిణీ

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ కనిమెరక శంకరరావు తన సొంత డబ్బులు రూ.30 వేలతో వైట్ యూనిఫాం, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుందరి మాట్లాడుతూ శంకరరావు తన సొంత డబ్బులతో విద్యార్థుల కోసం దుస్తులు, నోట్‌బుక్స్ కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. శంకరరావు మాట్లాడుతూ తానూ ఈ పాఠశాలలోనే చదువుకున్నానని, ఇక్కడ చదివేవారంతా పేదల పిల్లలేనని, వారికి సాయం అందించడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, లక్ష్మణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రాజాం: మండలంలో బొద్దాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. రాజాం వాసవీక్లబ్ వనితా శక్తి ప్రెసిడెంట్ పొట్నా శ్రీదేవి, కార్యదర్శి ఎం.శిరీష, కోశాధికారి వై.లలిత, తదితరులు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

మురిసిన మువ్వన్నెల జెండా

బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు... పోలీస్ దళాల కవాతు.. వివిధ శాఖల ప్రగతిని ప్రతిబింబించే శకటాలు.. పోలీస్ డాగ్‌ల విన్యాసాలు.. సాగులో కొత్త సాంకేతికతకు ప్రతిరూపంగా నిలిచే డ్రోన్లు.. స్వాతంత్ర్యోద్యమ నాయకుల కుటుంబ సభ్యులకు సన్మానాలు.. ఉత్తమ అధికారులకు సత్కారాలతో స్వాతంత్ర్య దినోత్సవం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం సంబరంగా సాగింది. జనం సాక్షిగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తినింపింది.





జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్)

- సూపర్ సిక్స్ అమలు చేస్తాం
- ముందుగా పింఛన్ పెంచాం
- అన్న క్యాంటీన్లలో రూ.5కు భోజనం
- పరిశ్రమలొచ్చేలా ప్రత్యేక ప్రయత్నాలు
- 2026 కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి
- సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అన్ని రంగాల్లో విజయనగరం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, అయినప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శాంతికపోతాలను ఎగురవేశారు. పోలీస్ దళాల పరేడ్‌ను తిలకించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుకలకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్‌బాబు, పాకలపాటి రఘువర్మ, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు హాజరయ్యారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, వివిధ శాఖల సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ అధికారులకు సేవాపతకాలను బహూకరించారు. 15 మంది కార్గిల్ యుద్ధవీరులను సన్మానించారు. హర్‌ఘర్ తిరంగా సంతకాల ఉద్యమంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ బోర్డుపై మంత్రి శ్రీనివాస్‌తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ 'జైహింద్' అని రాసి సంతకం చేశారు.

మంత్రి ప్రసంగం సాగిందిలా...

జిల్లాలో ఉన్న వనరుల సద్వినియోగం ద్వారా అభివృద్ధి చేయడానికి ఒక విజన్ డాక్యుమెంట్ రూపొందించి విడుదల చేస్తాం. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా విజయనగరంలో రెండు, బొబ్బిలిలో ఒకటి అన్న క్యాంటీన్లు 16వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నాం. ఎన్‌టీఆర్ భరోసా కింద పింఛన్ పెంచాం. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందించేందుకు ఏర్పాట్లు చేశాం.



- డెంకాడ, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో మూడు ఇసుక డిపోల నుంచి ఇసుక సరఫరా చేస్తున్నాం. ఇసుకను తవ్వి తీసేందుకు, డిపోల వద్దకు తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చులను మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నాం. డిపోల్లో 67,118 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది.
- రైతులకు 43,598 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా పంపిణీ చేశాం. యూరియా, డీఏపీ తదితర 19,941 మెట్రిక్ టన్నుల ఎరువులను కూడా సిద్ధంగా ఉంచాం. ఎరువులను, పురుగు మందులను డ్రోన్ల ద్వారా స్ప్రే చేయడానికి ప్రతి మండలం నుంచి ఒకటిరెండు గ్రామాలను ఎంపిక చేయడానికి ప్రతిపాదించాం. వచ్చే ఏడాది 35 హెక్టార్లలో మ్యాంగో క్లస్టర్, 1500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ క్లస్టర్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం. వచ్చే ఏడాదిలో సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్ ప్యాకేజీ-1, ప్యాకేజీ-2ల కింద రూ.140 కోట్లతో పూర్తి చేసి మిగిలిన ఆయకట్టుకు సాగునీరందించడానికి ప్రణాళికలు రూపొందించాం. తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేయడానికి కృషి చేస్తున్నాం. చంపావతి–నాగావళి నదుల అనుసంధానానికి సుమారు రూ.24.80 కోట్ల పనులకు ప్రతిపాదించాం.



- జిల్లాలో 20.81 లక్షల జనాభాకు 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 482 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 3 ఏరియా ఆస్పత్రులు, ఒక బోధనా ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి.
- మాతాశిశు సంక్షేమ కార్యక్రమాల ద్వారా బాలింతలు, శిశువుల మరణాలను తగ్గాయి. ప్రతి లక్ష ప్రసవాలకు జాతీయ స్థాయిలో తల్లుల మరణాలు 97 శాతం కాగా మన జిల్లాలో 60 శాతానికి, శిశువుల మరణాలు జాతీయ స్థాయిలో 32 శాతం ఉండగా మన జిల్లాలో 9 శాతం మాత్రమే ఉంది.
- జిల్లాలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఏడాది ప్రణాళిక రూపొందించాం. స్టార్ట్ అప్ కంపెనీలను, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల కోసం 100 కోట్ల ఖర్చుతో వెయ్యి యూనిట్లను స్థాపించి సుమారు 5 వేల మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం. ప్రతి నియోజకవర్గానికి కనీసం ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తాం. కొత్తవలస మండలం రెల్లిలో 158 ఎకరాల్లో రూ.218 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రతిపాదనలు తయారుచేశాం. కంటకాపల్లిలో 155 ఎకరాల్లో రూ.387 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా 3,850 మందికి ఉపాధి లభిస్తుంది. ఎస్.కోట మండలం ముషిడిపల్లి, చీడిపాలెం, చినకండేపల్లి, మూలబొడ్డవర, కిల్తంపాలెం గ్రామాల పరిధిలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో 1166.43 ఎకరాల్లో మరో పారిశ్రామిక పార్క్ త్వరలో ఏర్పాటుకానుంది.
- ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026 జూన్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని 506 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధికి రూ.9.36 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు శ్రమిస్తున్న అధికారులకు, అనధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు, సామాజిక కార్యకర్తలకు, ప్రజలందరికీ పేరు పేరునా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. శాంతి భద్రతలను కాపాడడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్న పోలీస్ యంత్రాంగానికి అభినందనలు.

● స్టాల్స్ పరిశీలన

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో డీఆర్‌డీఏ, వెలుగు, పౌరసరఫరాలు, నైపుణ్యాభివృద్ధి, ఏపీఈపీడీసీఎల్, పట్టణ పేదరిక నిర్మూలన, వైద్య ఆరోగ్య, విభిన్న ప్రతిభావంతులు, స్త్రీ, శిశు సంక్షేమం, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ, మత్స్యశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. దివ్యాంగులకు రూ.2లక్షల55వేలు విలువైన ల్యాప్‌టాప్, టచ్ ఫోన్‌లను అందజేశారు. మెప్మా ద్వారా 586 గ్రూపుల్లో ఉన్న 5,860 సభ్యులకు రూ.53.04 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం ఫోర్ట్: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. జామి కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన జయహో జన్మభూమి, నెల్లిమర్ల ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశ్ రంగీలా రంగీలా, ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థుల సరిహద్దున నువ్వే లేకుంటే.., చీపురుపల్లి, రాజాం బాలభవన్ విద్యార్థుల వందేమాతరం రీమిక్స్, పీఎస్ఆర్ విద్యార్థుల –దేశమంటే జనమంతా, చీపురపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు భారత్ పిలిచిందోయ్ భక్తిగీతాలకు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలిచ్చిన ఫోర్ట్ సిటీ(ప్రథమ), పీఎస్ఆర్ స్కూల్(ద్వితీయ), చీపురపల్లి బాలభవన్(తృతీయ) విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ప్రథమ స్థానం సాధించిన ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శన



ద్వితీయ స్థానం సాధించిన పీఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు



తృతీయ స్థానం సాధించిన చీపురపల్లి బాల భవన్ విద్యార్థులు

ఆకట్టుకున్న శకటాలు..

తమ ప్రగతిని తెలియజేస్తూ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ, డీఆర్‌డీఏ, విద్యా, వైద్యఆరోగ్య, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ, పోలీస్, క్రీడా ప్రాధికార సంస్థ, మున్సిపాలిటీ, పరిశ్రమలు, డ్వామా, స్త్రీ, శిశు సంక్షేమశాఖలు శకటాలను ప్రదర్శించాయి. వీటిలో అన్న క్యాంటీన్ శకటానికి (ప్రథమ), క్రీడాప్రాధికారసంస్థకు(ద్వితీయ), వ్యవసాయశాఖ శకటానికి తృతీయ స్థానం లభించాయి.



అన్నా క్యాంటీన్ శకటం (ప్రథమ)



క్రీడాప్రాధికార సంస్థ శకటం (ద్వితీయ)



తృతీయ స్థానం సాధించిన వ్యవసాయ శాఖ శకటం



హాజరైన ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘువర్మ



హాజరైన అతిథులు



పోలీస్ కవాతు

పంద్రాగస్టు పండగకు..తప్పిన కళ



టెంట్‌లు లేకపోవడంతో గొడుగులు వేసుకుని సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

- తూతూ మంత్రంగా, చప్పగా కార్యక్రమాలు
- ముఖం చాటేసిన కూటమి ప్రజాప్రతినిధులు
- కొట్టొచ్చినట్లుగా శాఖల మధ్య సమన్వయలోపం

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం అర్బన్:

స్వాతంత్ర్య దినోత్సవాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి చప్పగా, తూతూమంత్రంగా జిల్లాలో నిర్వహించడం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి సంవత్సరంలోనే కార్యక్రమాలు కళతప్పాయి. వీవీఐపీలే కాదు ప్రజాప్రతినిధులు కూడా ముఖం చాటేశారు. విద్యార్థుల సందడి కూడా కనిపించలేదు. గతంలో త్రివర్ణ పతాకంలోని రంగుల దుస్తులతో అధికారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవారు. ఈసారి వారిలో ఆ తరహా ఆసక్తే కనిపించలేదు.

- జాతీయ పతాకం నిర్ణీత సైజుల్లో గాకుండా చిన్నదిగా ఉందనే విషయమై కార్యక్రమం ప్రారంభానికి ముందు రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య చిన్న వాగ్వాదమే నడిచింది. అలాంటి తేడా ఉంటే ముందురోజే చూసుకోవాలి కానీ కార్యక్రమం మరో గంటలో ప్రారంభమయ్యేటప్పుడు చెబితే ఎలాగని వాదించుకున్నారు. ఈ విషయంలో పోలీస్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయలోపం కనిపించింది.
- ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రావడం, జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసుల వందన స్వీకరణ, ప్రసంగం... అన్నీ షెడ్యూల్ ప్రకారమే సాగిపోయాయి. కానీ ఆహ్వానితులు, సందర్శకులు మాత్రం రాలేదు. వీవీఐపీలు, కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టారు. దీంతో వారికోసం ముందు వరుసలో ఏర్పాటుచేసిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.
- కార్యక్రమానికి గతంలోకన్నా తక్కువ మందే వచ్చినా వారికీ కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో చాలామంది తాగునీటి కోసం అల్లాడిపోయారు.
- సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలకు వచ్చిన చిన్నారులు, వారి తల్లిదండ్రులకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడ్డారు. టెంట్‌ల ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే విలవిలలాడారు.
- వివిధ శాఖల అభివృద్ధి సూచికల పేరుతో ప్రదర్శించిన శకటాలన్నీ దాదాపుగా ఫ్లెక్సీలతో తయారుచేసినవే. ఏదో మొక్కుబడిగా సాగిపోయాయి.

గతంలో ఎన్నడూలేనివిధంగా ఈసారి మున్సిపల్ శాఖ శకటం ప్రదర్శనకు వచ్చింది. అన్నక్యాంటీన్ బొమ్మ పెద్దగా పెట్టి, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విజయనగరం అంతా జరిగిన అభివృద్ధి చిత్రాలను చిన్నవిగా చూపించారు. ఈ శకటానికే ప్రథమ బహుమతిని నిర్వాహకులు ప్రకటించడం మరో విచిత్రం.

- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీ అమలుచేయకపోయినా ఏదో అభివృద్ధి జరిగిపోయినట్లుగా శకటాలను ప్రదర్శించడం సందర్శకుల్లో నవ్వులు పూయించాయి.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం వైఎస్ఆర్ నగర్ రైల్వేట్రాక్ పక్కన ఉన్న మట్టిరోడ్డు ప్రాంతంలో ఒడిశాకు చెందిన జగన్నాథ్, అరకు వేలీకి చెందిన కె.ధనలక్ష్మి, దాసన్నపేటకు చెందిన తంగేటి శరత్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. జగన్నాథ్, ధనలక్ష్మి అరకు వేలీ పరిసర ప్రాంతాల్లో గంజాయిని సేకరించి విజయనగరంలో శరత్‌కు అమ్మడానికి వచ్చారన్నారు. గతంలో ముగ్గురుపైనా కేసులు ఉన్నాయన్నారు. గంజాయిని సీజ్ చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితులు)

ఘనంగా జయప్రకాష్ జయంతి

బాడంగి: మాజీ ఎమ్మెల్యే, దివంగత తెంటు జయప్రకాష్ 77వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముగడ గ్రామంలోని ఆయన ఇంటి వద్ద భార్య సత్యవతమ్మ, కుమారుడు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు జయప్రకాష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి తెంటువాని చెరువుగట్టు వద్ద ఉన్న ఆయన సమాధి వద్దకు చేరుకుని నివాళులర్పించారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) స్థానిక టీడీపీ కార్యాలయంలో జయప్రకాష్ విగ్రహానికి తెంటు లక్ష్మునాయుడుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ ఎంపీపీలు జగన్నాథనాయుడు, బొంతు త్రినాథనాయుడు, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.



మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే లక్ష్మునాయుడు